# నెల రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



పొన్నకల్‌లో బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), జూలై 11 : ప్రజాప్రతినిధులు చేపట్టిన పనులకు నెలలోపే బిల్లులు అందించేలా చర్యలు తీసుకుంటామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అదేవిధంగా మూసాపేట రైతువేదికలో తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలకు సన్మానం చేశారు. అనంతరం ఆదర్శ మహిళా సెంటర్‌ను సందర్శించి అందులో మహిళా క్యాంటీన్ ప్రారంభోత్సవం కోసం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన పదవికి న్యాయం చేసేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులకు సంబంధించి పార్టీలకతీతంగా నివేదికలు అందజేస్తే నెల రోజుల్లోపు అందజేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అడ్డాకుల మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన దోనూరు లింగారెడ్డి, ఆయన కూమారులు ఎన్ఆర్ఐలు కార్తీక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి రూ.2లక్షలతో గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా స్నేహ సంస్థ వారు గ్రామ సమీపంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. పొన్నకల్ జిల్లా, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులను సంస్థ మేనేజర్ రామేశ్వర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఇతర గ్రామాల నుంచి వస్తున్న 25 మంది విద్యార్థులకు సైకిళ్లను అందించాలని సంస్థ ప్రతినిధులను కోరారు. విద్యార్థుల టై, బెల్టుల కోసం రూ.50వేలు అందిస్తానని తాజా మాజీ ఎంపీపీ నాగార్జునరెడ్డి తెలిపారు.

# మక్తల్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, జూలై 11: మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి తన చిరకాల స్వప్నమని నియోజకవర్గ ప్రజల కలలను సాకారం చేసేందుకు నిరంతరం పనిచేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ ప్రాంతంలో కోర్టు లేకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. మక్తల్‌లో సివిల్, క్రిమినల్ కోర్టుల ఏర్పాటుకు వారం రోజుల్లో అనుమతులు వచ్చే విధంగా చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే తాత్కాలిక భవనంలో క్యాంప్ కార్యాలయంలో కోర్టును ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని చేపడతామని, మక్తల్‌కు ఎనిమిది డాక్టర్ పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు.సంతబజార్ కోసం ఆరెకరాల స్థలం కేటాయిస్తామన్నారు. కోర్టు ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, గణేశ్, రవికుమార్, కట్టా సురేశ్, వంశీ, నాగేందర్ పాల్గొన్నారు.

***మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం***

ఊట్కూర్, జూలై 11 : మహిళల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం ఊట్కూర్, నర్వ మండల కేంద్రాల్లో తాసీల్దార్ల అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు.

***ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు***

మరికల్, జూలై 11: తెలంగాణలో ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని, ప్రజా పాలనలో ప్రకటించినట్లు రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కచ్చితంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో నర్వ, మరికల్ మండలాలకు సంబంధించిన 19 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## వాలంటరీ రిటైర్మెంట్ స్కీం ఏర్పాటు చేయాలి

నారాయణపేట టౌన్, జూలై 11: అంగన్‌వాడీలకు వాలంటరీ రిటైర్మెంట్ స్కీం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం డిమాండ్ చేశారు. మున్సిపల్ పార్క్ వద్ద తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు గురువారంతో 6వ రోజుకు చేరాయి.

## మొక్కజొన్న పంట పరిశీలన

నవాబ్‌పేట, జూలై11: మండలంలోని కొల్లూరు గ్రామ శివారులో సాగు చేసిన మొక్కజొన్న పంటను గురువారం నాడు జడ్చర్ల ఏడీఏ అంజనేయులు పరిశీలించారు. ఏడీఏ వెంట ఏవో కృష్ణకిశోర్ ఉన్నారు.

## రిలీవ్ చేయాలని నిరసన

మరికల్, జూలై 11: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని గురువారం మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. లక్ష్మయ్య, తిరుపతయ్య తదితరులున్నారు.

## జిల్లా కోశాధికారిగా హరిప్రసాద్

నారాయణపేట టౌన్, జూలై 11: జిల్లా కోశాధికారిగా హరిప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

## మొక్కలను సంరక్షించాలి

బాలానగర్, జూలై 11: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జెడ్పీ సీఈవో రాఘువేంద్రరావు అన్నారు. గురువారం రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ పాఠశాల ఆవరణలో ఎంపీడీవో మశ్చేందర్, ఎంపీవో వెంకట్‌రాములు, ఏపీవో భారతి తదితర అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

***ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి***

మిడ్జిల్, జూలై 11: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని అడిషనల్ డీఆర్‌డీవో ముసాయిదా బేగం అన్నారు. గురువారం మండలంలోని భైరంపల్లి, రాణిపేటలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, ఏపీవో రాజేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**డాక్యుమెంట్ పోయినది**

జి. ఊర్మిళ భర్త జి. శశిధర్ రెడ్డి, వృత్తి: ఫార్మర్, వయస్సు: 44 సం॥లు, విల్లా నెంబర్:3, ఆర్.వి. నిమన్ కిస్మత్‌పూర్, హైదరాబాద్, నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్: 5028/2013 మరియు లింక్ డాక్యుమెంట్ నెంబర్: 3815/2008, 8683/1989, ప్లాట్ నెం. 08 మరియు 09, సర్వే నెంబర్: 239, మొత్తం గజాలు: 550, మరికల్ నుండి జిన్నారం మా ఇంటికి వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి, ఎవరికైన దొరికినచో ఈ నెంబర్లను సంప్రదించగలరు.
9347729789, 9849329789.

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్
- పాఠశాలలు, ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ధన్వాడ, జూలై11: ధన్వాడ మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులు వారంలో పూర్తి చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వందశాతం ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. అనంతరం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, విక్రయాల రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, పంచాయతీరాజ్ ఏఈ ప్రవీణ్ కుమార్, డీఈవో అబ్దుల్ ఘని, తాసీల్దార్ సింధూజ, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏవో శివకుమార్ సెక్టోరియల్ అధికారి శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం నరసింహాచారి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

***సాంకేతికతతో అధిక దిగుబడులు సాధించాలి***

నారాయణపేటరూరల్, జూలై 11: వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు పొందాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పేట మండల పరిధిలోని చిన్న జట్రంలో శివరాజ్ అనే రైతు వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పంటల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించిన జీలుగ పంటను పరిశీలించి, దానివల్ల కలిగే ప్రయోజనాలను రైతులనడిగి తెలుసుకొన్నారు. అలాగే గ్రామశివారులో సాగు చేసిన పత్తి,కంది,పెసర అంతరపంటలను పరిశీలించి వాటి వివరాలను వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్‌ను అడిగి తెలుసుకొన్నారు. పత్తి,వరి కొనుగోలు కేంద్రాల పనితీరుపై రైతులతో ఆరా తీశారు. కార్యక్రమంలో ఏవో శరత్‌చంద్ర, ఏఈవోలు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడాలి

భూత్పూర్, జూలై 11 : ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పరిరక్షించాలని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నూతన ఎస్సై చంద్రశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, మేనేజర్ అశోక్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ సైదమ్మ, నాయకులు రాములు, సురేశ్ గౌడ్, రాకేశ్, తిరుపతయ్య, విజయ్, ప్రేమ్‌కుమార్, ఆర్పీలు శోభ, వసంత పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తాం

హన్వాడ, జూలై 11: బహుజన మహనీయుల విగ్రహాల ఏర్పాటు కోసం అన్నికులాల వారిని కలుపుకొని విగ్రహాలను ఏర్పాటు చేస్తామని సింగిల్ విండో చైర్మన్ వెంకటయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వివిధ కులాల నాయకులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఈనెల17న మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహం ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గానికి చెందిన వ్యక్తులు మాత్రమే నిర్వహిస్తున్నారని అన్నారు. కులాలకతీతంగా ఆహ్వానించకుంటే రెండు రోజులో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

## విధులు బహిష్కరించిన లాయర్లు

మహబూబ్‌నగర్/జడ్చర్లటౌన్, జూలై11: సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై ఏఎస్సై దాడి చేయటాన్ని నిరసిస్తూ గురువారం జడ్చర్ల కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. జడ్చర్ల కోర్టు గేటు వద్ద న్యాయవాదులు నిరసన తెలుపుతూ న్యాయవాది రవికుమార్‌పై దాడికి పాల్పడిన ఏఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్‌లో న్యాయవాదులు కోర్టు గేటు వద్ద నిరసన చేపట్టి, విధులు బహిష్కరించారు.

## నేడు పీయూలో వెబినార్

పాలమూరు, జూలై 11: స్థానిక పాలమూరు విశ్వవిద్యాలయంలో శుక్రవారం పీయూ జువాలజీ విభాగం ఆధ్వర్యంలో లైఫ్ సైన్సెస్‌లో జేజేఆర్ ఎఫ్ నెట్టు ఏ విధంగా సాధించాలనే అంశాలపై వెబినార్ నిర్వహించనున్నట్లు పీయూ పీఆర్‌వో రవికుమార్ తెలిపారు. గురువారం బ్రోచర్‌ను పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు.

## ఎన్టీఆర్ కళాశాలకు అటానమస్ స్టేటస్

పాలమూరు, జూలై 11: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలో అటానమస్ స్టేటస్‌ను స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల దక్కించుకున్నట్లు ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా అటానమస్ స్టేటస్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

## పెద్దరేవల్లి రహదారి పనులు షురూ

బాలానగర్, జూలై 11: మండలంలో దశాబ్దాల కాలంగా హామీలకే పరిమితమైన బాలానగర్ – గంగాపూర్ రహదారి నిర్మాణం పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఆర్‌అండ్‌బి పరిధిలోని ఈ రహదారి నిర్మాణం పనుల మంజూరు వ్యవహారం కొంతకాలంగా వివాదాస్పదంగా మారగా, సుమారు 28 కిలోమీటర్ల ఈ రహదారి నిర్మాణం పనులకు గాను రూ. 56 కోట్లు ఖర్చు చేయనున్నట్లు సమాచారం. తాజాగా గురువారం బాలానగర్ మండలంలోని గౌతాపూర్, బోడజానంపేట పరిసరాల్లో రహదారి పక్కన చెట్లను తొలగించే పనులను ప్రారంభించినట్లు ఆర్‌అండ్‌బి ఏఈ ప్రశాంత్ తెలిపారు.

## యువత సమస్యలపై పోరాటం

నారాయణపేట, జూలై 11: యువత దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పీవైఎల్ పోరాటం చేస్తుందని పీవైఎల్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షులు సలీం అన్నారు. గురువారం పట్టణంలోని పీవైఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశం యువశక్తిని కలిగి ఉన్నదని, కానీ పాలకులు సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. మద్యం, డ్రగ్స్, గంజాయి తదితర వాటి మత్తులో ఉండేలా యువతను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 150 మంది ప్రతినిధులతో ఖమ్మంలోని మధిరలో ఈనెల 13, 14 తేదీల్లో విద్యా వైజ్ఞానిక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాము, జిల్లా నాయకులు బాలు, సాబేర్ పాల్గొన్నారు.

***డీఎస్సీని పోస్ట్‌పోన్ చేయాలి***

డీఎస్సీని పోస్ట్‌పోన్ చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యక్షుడు సలీం డిమాండ్ చేశారు. డీఎస్సీని పోస్ట్‌పోన్ చేయాలని నిరుద్యోగులు 20 రోజులుగా పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. డీఎస్సీని పోస్ట్‌పోన్ చేయకపోతే పీవైఎల్ ఆధ్వర్యంలో పోరాడతామని స్పష్టం చేశారు.

# ఇంటింటా ఇన్నోవేటర్ సెల్

- కలెక్టర్ విజయేందిర బోయి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 11: ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహిణుల నుంచి పాఠశాల, కళాశాలల విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఇతరులు ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపించే అవకాశం కల్పిస్తుందన్నారు. వినూత్న ఆవిష్కరణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 3 చివరి తేదీ అని తెలిపారు. 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణ ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా సమన్వయకర్త లాస్య ఉన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



కప్పెటలో వనమహోత్సవాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 11: వర్షాకాలంలో డెంగీ, చికున్ గున్యా, డయేరియా, విష జ్వరాల వంటి సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య,ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ విద్యాశాఖ మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

***పనులను వేగవంతం చేయాలి***

భూత్పూర్, జూలై 11 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. గురువారం మండలంలోని కప్పెట యూపీఎస్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు.

# జనాభా నియంత్రణకు కృషి చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణ



జనాభా నియంత్రణకు సహకరించిన మహిళకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ

మహబూబ్‌నగర్, జూలై 11: జనాభా నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుం చి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌వో కృష్ణ హాజరై జెండా ఊపి ర్యా లీని ప్రారంభించారు. జిల్లాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రతి మంగళవారం, శుక్రవారం పీపీ యూనిట్ మహబూబ్‌నగర్‌లో జరుగుతాయని డాక్టర్ భాస్కర్ నాయక్, డా.రఫీక్ శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాల కుటుంబ నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులను సన్మానించారు. అదేవిధంగా ఒకరే అమ్మాయికి ఆపరేషన్ చేయించుకున్న వాళ్లకి, ఇద్దరు పిల్లల తర్వాత ఆపరేషన్ చేసుకున్న వాళ్లకి, అంతర ఇంజెక్షన్ వాడుతున్న వారికి ప్రోత్సాహంగా వెయ్యి రూపాయలు నగదు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డా.శ్రీధర్‌రెడ్డి, డా.శశికాంత్, డా.సంధ్య కిరణ్మయి, డెమో అధికారి తిరుపతిరావు పాల్గొన్నారు.

***అందరి బాధ్యత..***

నారాయణపేట టౌన్, జూలై 11: జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పీవో ఎంహెచ్‌ఎన్ డా.శైలజ, పీవో టీబీ సాయిరాం, ఎంపీహెచ్‌ఈవో గోవిందరాజు పాల్గొన్నారు.

***అధిక జనాభాతో ఇబ్బందులు..***

భూత్పూర్, జూలై 11 : అధిక జనాభా దేశానికి, కుటుంబానికి భారాన్ని కలిగిస్తుందని మండల ప్రాథమిక వైద్యాధికారి రబ్బు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురష్కరించుకొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

నారాయణపేట, జూలై 11: మొహర్రం ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీఐ శివశంకర్ తెలిపారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో ఎస్సై వెంకటేశ్వర్లుతో కలిసి పీర్ల ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించి సీఐ మాట్లాడారు.

***అప్రమత్తంగా ఉండాలి..***

దేవరకద్ర, జూలై 11 : అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాబృందం సభ్యులు విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు సురక్ష కళాబృందం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సంయుక్తంగా సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

***జాగ్రత్తగా ఉండాలి..***

బాలానగర్, జూలై 11: అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై తిరుపాజీ కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు సూచించారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం కస్తూర్బా విద్యార్థులకు సైబర్ నేరాలపై తగిన సూచనలు చేస్తూ అవగాహన కల్పించారు.

***మాగనూరులో..***

మాగనూర్, జూలై 11: ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఎస్పీ వేంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మాగనూర్ మండల కేంద్రంలో గురువారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఆది జాంబవ జన్మదిన వేడుకలు

నవాబ్‌పేట, జూలై11: మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో మాదిగ జాగృతి ఆధ్వర్యంలో గురువారం ఆదిజాంబవ మహారాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగానే ఆది జాంబవ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

నారాయణపేట, జూలై 11: పట్టణంలోని ఎంబీ చర్చి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని, తన లుంగీతో ఉరివేసుకున్నట్లు కనిపించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. శరీరంపై నల్లని మచ్చలు ఉన్నాయని, చొక్కపై శ్రీమాన్ కేసీఎం అని టైలర్ మార్క్ ఉందని, ముస్లిం వ్యక్తిలా కనిపిస్తున్నాడని తెలిపారు. మృతదేహాన్ని పేట జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని, సంబంధికులు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ఊట్కూర్ ,జూలై 11: బైక్ అదుపు తప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపొర్ల గ్రామానికి చెందిన మహేశ్, మల్లప్ప గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వచ్చి, తిరిగి వెళ్తుండగా కొల్లూరు స్టేజి సమీపంలో వీరు ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో, ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర రెడ్డి గుర్తించి మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



రాములు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు/హన్వాడ, జూలై 11: ప్రతి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హన్వాడ మం డల మాజీ వైస్ ఎంపీపీ దస్తయ్య తండ్రి రాములు అనారోగ్యంతో చనిపోవడంతో గురువారం రాములు పార్థివదేహానికి శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మహబూబ్‌నగర్ 4వ వార్డు ఎదిర బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎలయ్య తండ్రి బుచ్చన్న మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నర్సింహులు, రాములు, వెంకటయ్య, హకీం, శేఖర్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## పాలమూరు అభివృద్ధికి కృషి చేస్తా

- ఎంపీ డీకే అరుణ



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

దేవరకద్ర, జూలై 11 : పాలమూరు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం దేవరకద్రలో నిర్వహించిన కృతజ్ఞతా సభకు ఆమె హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ తనను ఓడించడానికి ఎంతో తాపత్రయపడ్డారని, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా బీజేపీ గెలుపును ఆపలేకపోయారన్నారు. ప్రతిపక్షాలపై ఆరోపణలు మాని అభివృద్ధిపై సీఎం దృష్టిసారించాలన్నారు. దేవరకద్రలోని రైల్వే గేట్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడుతానన్నారు.

***సమగ్రాభివృద్ధికి పాడుపడదాం..***

జడ్చర్లటౌన్, జూలై 11 : జిల్లా సమగ్రాభివృద్ధికి పార్టీలకతీతంగా పాడుపడదామని ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం జడ్చర్లలోని బీఆర్ రెడ్డి ఫంక్షన్‌హాల్ నుంచి ప్రేమ్‌రంగా గార్డెన్ వరకు బీజేపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి.

## నేడు ఉద్యోగ మేళా

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 11: జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి జానీపాషా గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ పాస్ లేదా ఫెయిల్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ డిప్లొమా, బీటెక్ చదివిన 18 నుంచి 40 ఏండ్లలోపు వయస్సు గల వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 95502 05227, 99485 68830, 91260 5508, 96668 22717 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## గ్రూప్-1 ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 11: తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, తెలంగాణ మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం టీజీపీఎస్సీ గ్రూప్–1 (మెన్స్) కోసం రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో ఉచిత కోచింగ్ ఇవ్వనునట్లు జిల్లా మైనారిటీస్ వెల్ఫేర్ అధికారి ఇందిర గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 19లోపు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు మెయిల్ ఐడీ DIRECTORMSCCCTELANGANA@ GMAIL.COM , ఫోన్ నెంబర్ 040–23236112లో సంప్రదించాలని కోరారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

దేవరకద్ర, జూలై 11 : ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. గురువారం అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి సందర్భంగా మండలంలోని చౌదర్‌పల్లి శివారులోని స్విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ డే నిర్వహించారు. బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

జడ్చర్ల టౌన్, జూలై11 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈనెల 12, 14 తేదీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరుగనున్న సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరపున ఆడనున్నారు. బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న వర్ష, అనూష, పల్లవి, పూజ, నిఖిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావటం పట్ల పాఠశాల హెచ్‌ఎం చంద్రకళ, పీఈటీలు రామ్‌కల్యాణ్, వడన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

## హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఊట్కూర్, జూలై 11: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ భవాని చెప్పారు. గురువారం స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బాలానగర్, జూలై 11: రాజాపూర్‌కు చెందిన కృష్ణయ్య రాజాపూర్ శివారులోని దుందుభి వాగులోంచి ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకొని మల్లెపల్లి నుంచి రాజాపూర్ వైపు వెళ్తుండగా పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న సుదర్శన్, రామకృష్ణారెడ్డి అనే పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై కె. రవి తెలిపారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ అయిన కృష్ణయ్యపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## సమస్యలు పరిష్కరించాలి

నవాబ్‌పేట, జూలై11: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నలవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకై గురువారం నాడు నవాబ్‌పేట మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రిలే దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

బాలానగర్, జూలై 11: రాజాపూర్‌కు చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై శ్రీశైలం వెళ్తున్నారు. రాజాపూర్ మండల కేంద్రంలో రహదారి డివైడర్‌పై చెట్లను తొలగిస్తున్న కార్మికులు రహదారి మధ్యలో స్టాపర్స్ ఏర్పాటుకు కర్నూలు వైపు వెళ్తున్న వాహనాలు రద్దీగా వెళ్తున్నాయి. అదే సమయంలో మండల కేంద్రానికి చెందిన శివ, జ్యోతి వెళ్తున్న ద్విచక్ర వాహనం ముందు వెళ్తున్న ఓ కారును ఢీకొట్టి అదుపుతప్పి రహదారి పక్కనున్న కాల్వలోకి దూసుకువెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జ్యోతికి తలకు గాయాలయ్యాయి.